సాక్షి
విజయనగరం
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



నూతన సంస్కరణలు..

విద్యార్థులకు అధిక ప్రయోజనం కల్పించేలా విద్యారంగంలో ప్రభుత్వం నూతన సంస్కరణలు అమలుచేస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. - 8లో



దొడ్డిదారిన బాల్య వివాహం..!

బాల్య వివాహాల కలిగే అనర్థాలను వివరిస్తున్నా కొందరిలో మార్పురావడం లేదు. దీనికి భోగాపురంలో ఇటీవల జరిగిన ఓ బాల్యవివాహమే నిదర్శనం. - 8లో



చిట్టి గురువులకు ప్రశంసలు

విజయనగరం జీపీఎం (బొడ్డు పైడం నాయుడు మెమోరియల్) కార్పొరేషన్ పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. చిట్టిగురువులను అభినందించారు. - 8లో

న్యూస్‌రీల్

రామనారాయణాన్ని సందర్శించిన కంచి పీఠాధిపతి



కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతిని దర్శించుకుంటున్న ఎన్‌సీఎస్ ట్రస్టీలు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం రామనారాయణాన్ని కంచికామకోటి పీఠాధిపతి వంకర విజయేంద్ర సరస్వతి సోమవారం సందర్శించారు. రామనారాయణం ప్రాంగణంలోని వేద పాఠశాల విద్యార్థులు వేద పఠనం, కోలాటాలతో కంచి పీఠాధిపతికి స్వాగతం పలికారు. రామనారాయణాన్ని సందర్శించిన అనంతరం భక్తులను ఆశీర్వదించారు. పీఠాధిపతిని ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, మురళి, శ్రీనివాస్, నీరజవల్లి దర్శించుకున్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం ప్రధాన ఆచార్యులు కృష్ణప్రసాద్, సంపత్‌లు పాల్గొన్నారు.

రైతుల శ్రమదానం



పిచ్చిమొక్కలను తొలగించడంతో కాలువ ద్వారా వెళ్తున్న సాగునీరు

రేగిడి: మడ్డువలస ఆయకట్టులోని 18 ఎల్ఆఫ్ 10ఆర్ కాలువలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రాజెక్టు నుంచి నీరు సమృద్ధిగా విడిచిపెడుతున్నా ఉప్పరనాయుడువలస, చాటాయవలస, వండానపేట గ్రామాల పరిధిలో రబీ సాగుకు నీరు అందడం లేదు. దీంతో మూడు గ్రామాల రైతులు ఏకమయ్యారు. సర్పంచ్‌లు కరణం గోవిందరావు, వియ్యపు చక్రపాణిల ఆధ్వర్యంలో సుమారు 200 మంది రైతులు సోమవారం శ్రమదానంతో పిచ్చిమొక్కలు తొలగించారు. పొలాలకు నీరు చేరడంతో సంతోషం వ్యక్తంచేశారు.

క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారణ సులభమే



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మలీల, డాక్టర్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభమేనని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు పేర్కొన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రొమ్ము, నోటి క్యాన్సర్ అధికమందికి సోకుతోందన్నారు. ఆలస్యంగా పిల్లలు పుట్టడం, పిల్లలకు తల్లిపాలు పెట్టకపోవడం, జన్యు లోపం, వంశపారంపర్యంగా హార్మోన్ మందుల వినియోగంవల్ల రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు తినడం, మద్యం అతిగా సేవించడం నోటి క్యాన్సర్‌కు కారణమన్నారు. శిబిరంలో సుమారు 750 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.ఎ.రమణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్, జనరల్ సర్జరీ వైద్యులు డాక్టర్ శశిధర్, డాక్టర్ సురేష్ కుమార్, ఈఎస్‌టీ వైద్యులు డాక్టర్ రామకృష్ణంరాజు, డాక్టర్ రమేష్, దంత వైద్యులు కామేశ్వరావు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ కె.బి.బి.రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి ఐదో తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ, ఈబీసీ విద్యార్థులు 9-11, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9-13 సంవత్సరాల మధ్య వయస్సు వారై ఉండాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.లక్షకు మించకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో రెండేళ్లపాటు నిరంతరాయంగా చదివిన వారు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 4వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

గిరిజన గూడలకు ప్రగతి బాటలు

- కారడవుల్లో కాలిబాటలకు ఇక సెలవు
- ఏడున్నర మీటర్ల వెడల్పున తారురోడ్లు
- సుమారు రూ.61 కోట్లతో నిర్మాణ పనులు
- శరవేగంగా ఆరు రోడ్ల నిర్మాణం
- మార్చిలో మరో ఐదు రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభానికి సన్నద్ధం
- ఈ ఏడాదిలోగా రోడ్లన్నీ సాకారం చేయడానికి ప్రభుత్వం కంకణం
- ఏ ఒక్క రోడ్డు పనులూ ఆగకూడదని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు
- గిరిజన సంక్షేమ మంత్రి రాజన్నదొర ప్రత్యేక చొరవ

మన్యం వాసులకు మహర్దశ. గిరిశిఖర ప్రజల రాకపోకలకు చక్కని'దారి' చూపాలన్న ప్రజాప్రతినిధుల కృషి ఫలించింది. గిరిజన గూడలకు ప్రగతిబాటలు పడుతున్నాయి. ముళ్లు, రాళ్లతో కూడిన దారులన్నీ రాచబాటలుగా మారుతున్నాయి. దీనికి ఏజెన్సీలో చకచకా సాగుతున్న తారురోడ్ల నిర్మాణాలే నిలువెత్తు సాక్ష్యం.



వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరుకు రోడ్డు వరకూ తలపెట్టిన రోడ్డునిర్మాణం

పాచిపెంట మండలంలోని వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరకు రోడ్డు వరకూ కాలి బాట మాత్రమే ఉండేది. కనీసం ద్విచక్ర వాహనాలపై కూడా వెళ్లలేని పరిస్థితి. దీన్ని 7.5 మీటర్ల వెడల్పున పది కిలోమీటర్ల పొడవున నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.9.97 కోట్లతో చేపట్టిన పనులను జూలై నాటికల్లా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇది పూర్తయితే పాచిపెంట మండలం నుంచి అల్లూరు సీతారామరాజు జిల్లాలోని అరకు వెళ్లడానికి దగ్గరి మార్గం అవుతుంది. రాకపోకలకు అనువుగా ఉంటుంది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కనుచూపుమేరలో విస్తరించిన అడవులు.. కొండలు.. ఆ మధ్యలో అక్కడక్కడ విసిరేసినట్టుగా ఉండే గిరిజన గూడలు. ఇన్నాళ్లూ.. అక్కడ నివసించే గిరిజనుల రాకపోకలకు రాళ్లు, ముళ్లదారులే దిక్కు. వైద్యానికో, మరేదైనా అత్యవసరమైన పనుంటే కాలిబాటలే శరణ్యం. గర్భిణులనైతే డోలీలో తరలించాల్సిందే. వర్షం కురిస్తే కనీసం ద్విచక్ర వాహనాలూ వెళ్లని దుస్థితి. ఇప్పుడు వారి గూడలన్నీ కలుపుతూ తారురోడ్లు నిర్మితమవుతున్నాయి. వారి జీవితాలకు చక్కని 'దారి' కనిపిస్తోంది. తనను ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్న ఆ గిరిజనుల రుణం తీర్చుకోవాలన్న డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కృషి ఫలిస్తోంది. గిరిశిఖర గ్రామాలకు ఏకంగా 11 రోడ్లు సాకారం కానున్నాయి. అటవీశాఖ సహా మరేశాఖ వల్లనైనా ఏ ఒక్క రోడ్డు నిర్మాణ పనులూ ఆగకూడదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. దాదాపు రూ.61 కోట్లతో తలపెట్టిన ఈ రోడ్ల నిర్మాణాన్ని ఈ ఏడాదిలోగా పూర్తిచేసేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

కృషి ఫలించిన వేళ..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో గిరిశిఖర గ్రామాలు ఎక్కువగా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నాయి. ముఖ్యంగా సాలూరు, పాచిపెంట మండలాల్లో అత్యధిక గిరిజన కుటుంబాలు దట్టమైన అటవీ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. ఇప్పటి వరకూ కాలిబాటలుగా ఉన్న మార్గాలను తారురోడ్లుగా అభివృద్ధి చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర తొలి నుంచీ కృషి చేస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో కొన్ని రోడ్లను మంజూరు చేయించారు. తర్వాత టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపనలు, జీవోలకే రోడ్ల నిర్మాణం పరిమితమైంది. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే గిరిశిఖర గ్రామాలకు రోడ్ల నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. రాజన్నదొర కృషి ఫలించింది.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల అనుసంధాన ప్రాజెక్టు (ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ) కింద సాలూరు, పాచిపెంట మండలాల్లోని గిరిశిఖర గ్రామాల సౌకర్యార్థం 77.90 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.61 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మూడు రోడ్లు మినహా మిగతా ఎనిమిది రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసింది. మిగిలిన మూడు రోడ్లకు అటవీ శాఖ తుది అనుమతి మాత్రమే ఇవ్వాల్సి ఉంది.

శరవేగంగా నిర్మాణ పనులు....

ఇటీవలే సాలూరు మండలంలోని నంద-పగులుచెన్నేరు నుంచి కొదమకు సుమారు రూ.1132.56 లక్షలతో తలపెట్టిన రోడ్ల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్ భూమిపూజ చేసిన సంగతి తెలిసిందే. పాచిపెంట మండలంలో ఆజూరు నుంచి పందిరిమామిడివలస రోడ్డు నిర్మాణానికి కూడా రాజన్నదొర భూమిపూజ చేశారు.



చిత్రంలో పంచాయతీరాజ్ అధికారులు పరిశీలిస్తున్నది... సాలూరు మండలంలోని నందా-పగులుచెన్నూరు రోడ్డు నుంచి చోర మీదుగా కొదమ వరకూ మూడు కొండల మీదుగా ఏడు కిలోమీటర్ల పొడవున సాగుతున్న రోడ్డు పనులు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో తలపెట్టిన ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.11.33 కోట్లను మంజూరు చేసింది. ఇప్పటి వరకూ కొదమ గ్రామం నుంచి సాలూరు రావాలంటే ఒడిశా మీదుగా దాదాపు 60 కిమీ మేర ప్రయాణం చేయాల్సి వచ్చేది. రోడ్డు పూర్తి అయితే ఆ వ్యయప్రయాసలు తప్పుతాయి. దాదాపు 25 కిమీ ప్రయాణిస్తే సాలూరు చేరిపోవచ్చు.

అటవీ శాఖ క్లియరెన్స్ తరువాయి...

పాచిపెంట మండలంలో మరో మూడు కీలకమైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అటవీ శాఖ తుది అనుమతి రావాల్సి ఉంది.

- ఆలూరు నుంచి గాదిలమడ మీదుగా మోదుగ వరకూ 6 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి అధికారులు అన్నీ సిద్ధం చేశారు. ప్రభుత్వం రూ.4.03 కోట్ల నిధులను మంజూరు చేసింది. అటవీ శాఖ తుది అనుమతి రావడమే ఆలస్యం.
- వేటగానివలస నుంచి తంగ్లాం వరకూ 8 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. దీని నిర్మాణానికి రూ.6.28 కోట్లు మంజూరయ్యాయి.
- వేటగానివలస-తంగ్లాం రోడ్డు నుంచి మూటకూడు మీదుగా బొడ్డపాడు వరకూ 5.60 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.6.18 కోట్ల నిధులను మంజూరు చేసింది.



ఆజూరు నుంచి పందిరిమామిడివలస వరకు నిర్మిస్తున్న తారురోడ్డు

పాచిపెంట మండలంలోనే ఆజూరు నుంచి చాకిరాయివలస మీదుగా పందిరిమామిడివలస వరకూ ఒకప్పుడు కాలిబాట మార్గమే ఉండేది. దాదాపు 6.80 కిమీ పొడవున 7.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొత్తం ఈ రోడ్డు నిర్మాణవ్యయం రూ.2.24 కోట్లు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



గిరిజనులకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గిరిశిఖర గ్రామాల ప్రజల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నా. గిరిజనులకు ఎల్లప్పుడూ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుటుంబం అండగా నిలుస్తోంది. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిశిఖర గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి వెలుగులు వచ్చాయి. ఈ గిరిశిఖర గ్రామాల్లో రహదారులకు అటవీశాఖ అనుమతులు రావడానికి ముఖ్యమంత్రి జగన్ సహాయసహకారాలు మరువలేనివి.

– పీడిక రాజన్నదొర, గిరిజన సంక్షేమశాఖ మంత్రి

నవంబర్‌లోగా నిర్మాణ పనులు పూర్తి

తరతరాల నుంచి రహదారి సౌకర్యం లేక సామాన్య జీవనానికి దూరంగా ఉన్న గిరిజనులకు కొత్తగా చేపట్టిన రోడ్లు వెలుగు జీవితాన్ని ప్రసాదించనున్నాయి. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఇలాంటి ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టే అవకాశాన్ని ప్రభుత్వం మాకు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ ఏడాది నవంబర్‌లోగా రోడ్లు అన్నీ నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, ఎస్ఈ, పంచాయతీరాజ్ శాఖ

గిరిశిఖర గ్రామాలకు రోడ్లు

- పాచిపెంట మండలంలో కుంటాం బీటీ రోడ్డు నుంచి తుమ్మిగుడ్డి వరకూ దాదాపు 6.90 కిమీ పొడవున రోడ్డు నిర్మాణం జరుగుతోంది. దీనికి నిర్మాణ వ్యయం రూ.4.65 కోట్లు. ఒకప్పుడు కాలిబాట మాత్రమే ఉండే మార్గాన్ని 7.5 మీటర్ల మేర వెడల్పున, దీనిలో తారురోడ్డు 4 మీటర్ల మేర నిర్మాణం చేస్తున్నారు. రెండు వంతెనల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- పాచిపెంట మండలంలో రొడ్డవలస నుంచి కంకణాపల్లి వరకూ 1.70 కిమీ పొడవున రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.1.35 కోట్ల వ్యయంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకూ ఇక్కడ కాలిబాట మార్గమే ఉంది.
- పాచిపెంట మండలంలోనే నీలంవలస నుంచి గుమ్మిడిగూడ వరకూ 6.80 కిమీ పొడవున 7.5 మీటర్ల వెడల్పున రోడ్డును నిర్మిస్తున్నారు. 4 మీటర్ల వెడల్పున తారు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. దీని నిర్మాణ వ్యయం రూ.3.765 కోట్లు.



నీలంవలస నుంచి గుమిడి గూడ రోడ్డు నిర్మాణ పనులు

- సాలూరు మండలంలోని దిగువ సెంబి నుంచి దిప్పలపాడు మీదుగా థోనాం వరకూ రూ.6.20 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సుమారు 6.5 కిమీ పొడవున నిర్మాణ పనులను మార్చి నెలాఖరులోగా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.
- సాలూరు మండలంలో విశాఖపట్నం-రాయ్‌పూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 26)ని అనుసంధానించేలా 7.3 కిమీ పొడవున కారాడవలస వరకూ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.4.97 కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణం ఆగస్టు నాటికి పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.



కారాడవలసకు రోడ్డు నిర్మాణం



కొదమ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న రాజన్నదొర, మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నిషాంత్‌కుమార్, తదితరులు (ఫైల్)

జాతరో జాతర..

- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- మొక్కుబడులు చెల్లించిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

చీపురుపల్లి కనకమహాలక్ష్మి, జామి ఎల్లారమ్మ, రాజాం పోలిపల్లి పైడితల్లి అమ్మవార్ల జాతర్లు వైభవంగా సాగాయి. అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు జరిపారు. మొక్కుబడులు చెల్లించారు. జాతర్లలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి రెండోరోజు సోమవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు క్యూకాంప్లెక్స్‌లు కిక్కిరిశాయి. జాతరలో తొలిరోజు ఆదివారం దర్శనం టిక్కెట్లు రూపంలో 3,37,495 లక్షలు ఆదాయం లభించింది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఆర్ఆర్ఆర్ ఈవెంట్స్ నేతృత్వంలో రేలా రే రేలా కార్యక్రమంలో భాగంగా పల్సర్ బైక్ ఫేమ్ రమణ గేయాలాపన, శ్రీకాకుళానికి చెందిన డాన్స్ బేబీ డాన్స్ నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. అంధుల సంగీత విభావరి, హరిశ్చంద్ర మొదటి ఘట్టం పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పైడితల్లికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర రెండో రోజు సోమవారం భక్తులతో కళకళలాడింది. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ఏర్పాట్లను ఏసీ సుధారాణి పరిశీలించారు. సర్వదర్శనం క్యూలైన్ ఏర్పాటు చేయాలంటూ ఈఓ బీవీ మాధవరావును ఆదేశించారు. జాతరకు అంతా సహకరించాలని కోరారు. ఆమెవెంట నవదుర్గ ఆలయ ఈఓ పి.శ్యామలరావు, ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ ఉన్నారు. పోలిపల్లి పైడితల్లి అమ్మవారిని విజయనగరం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఆమెతో పాటు వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి దర్శనానికి వచ్చిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు



పోలిపల్లి పైడితల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

జనసంద్రమైన జామి

జామి: శరణు శరణు ఎల్లారమ్మతల్లి.. నీకు శరణు శరణు... అంటూ జామి ఎల్లారమ్మను జముకుల పాటతో ఆదివారం రాత్రి 10.45 గంటలకు అనువంశీకుల ఇంటివద్ద అమ్మవారిని గద్దె దింపారు. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యా లు, మహిళల కోలాట ప్రదర్శనలు, వివిధ వేషధారణల నడుమ అమ్మవారిని గ్రామంలోని ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. రాత్రి రెండున్నరగంటల సమయంలో ఆలయప్రవేశం జరిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి



ఎల్లారమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

దారిపొడవునా అమ్మవారికి పసుపునీటితో భక్తులు అభిషేకాలు చేశారు. లక్ష్మీస్వరూపిణి అలంకరణలోని అమ్మవారి దర్శనానికి సోమవారం వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరారు. సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చినట్టు ఆలయ అధికారుల అంచనా. ఎల్లారమ్మ జాతరకు వచ్చే బంధువులతో రామయ్యపాలెం, లక్ష్మీపురం, జన్నివలస, విజినిగిరి, లొట్లపల్లి, జె.డి.వలస సందడిగా మారాయి. అమ్మవారికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కరుణ, కటాక్షం ప్రజలందరిపైనా ఉండాలని ప్రార్థించారు.

స్వచ్ఛంద సేవలు..

జాతరలో జామి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి, ఆర్యవైశ్య సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఐ.సుబ్బారాజు, జిల్లా దళిత మహాసభ అధ్యక్షుడు పత్రి అప్పారావు తదితరులు భక్తులకు మజ్జిగ, తాగునీరు, పులిహోర, సేమియా పాయసం పంపిణీ చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి, డీఆర్వో ఎం.గణపతిరావు

విజయనగరం అర్బన్: శాసనమండలి ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని, ప్రతి అంశాన్ని పరిశీలించాల్సిన బాధ్యత వారిపై ఉందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టంచేశారు. పోలింగ్ స్టేషన్లలో ఏపీఓలను, పీఓలకు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఆదేశించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నియమించిన విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల నియమావళి, నిబంధనలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశంపైనా సూక్ష్మ పరిశీలకులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సొంత నిర్ణయాలు తీసుకోరాదని హితబోధచేశారు. ఉదయం సాయంత్రం వరకు జరిగే ఎన్నికల సరళి, ఇతర అంశాలపై నివేదిక అందజేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి


మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఆదివారం గాయపడిన వ్యక్తి విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం వెదురువాడ గ్రామానికి చెందిన రేగిడి రాము, సూర్యం దంపతులు విజయనగరం నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామం వెదురువాడ వస్తుండగా మండలంలోని కొర్లాం కాటా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యం అక్కడక్కడే మృతిచెందింది. తీవ్రగాయాల పాలైన రామును 108లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ రాము సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

33 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత


పీడీఎస్ రైస్ వ్యాన్‌తో ఎస్సై అమ్మాన్‌రావు, రెవెన్యూ సిబ్బంది

భామిని: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 33 పీడీఎస్ బియ్యం బస్తాలను పట్టుకుని సీజ్ చేశామని బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు సోమవారం తెలిపారు. సుమారు 1650 కేజీల పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించామని, వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

159 మందిపై బైండోవర్ కేసులు

జియ్యమ్మవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా 159 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట సోమవారం హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. గ్రామాలలో ఎటువంటి అలజడి సృష్టించినా వారిపై తగు చర్యలుంటాయని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ఓటర్లంతా సహకరించాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: భర్త, తోడికోడళ్ల వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఉడాకాలనీలో నివాసముంటున్న మమత (25) కొంతకాలంగా భర్త, తోడికోడళ్ల వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో ఆదివారం రాత్రి తాను నివాసం ఉంటున్న ఇంటికి ఎదురుగా సాయిబాబా ఆలయం వద్ద ఉన్న ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త రామారావు మైలాన్ పరిశ్రమలో కెమిస్ట్‌గా పనిచేస్తున్నాడు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

మూడో అంతస్తు నుంచి జారి పడి వ్యక్తి మృతి
స్థానిక తోటపాలెంలో గల ఓ ఇంటి మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ ఇంటికి ఆమె స్నేహితుడు సంజయ్ నాయుడు (25) సోమవారం వచ్చాడు. ఆయన వచ్చిన కాసేపటికి ఆమె భర్త ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో వెళ్లిపోదామని బయలుదేరిన నాయుడు ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి జారిపడిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹180	₹ 190

అర్జీలకు సకాలంలో పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలపై తక్షణమే స్పందించి గడువులోగా పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌లు పాల్గొని ప్రజల నుంచి 86 అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో సామాజిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలపై చర్యలు గురించి సంబంధిత అధికారులతో నేరుగా, ఫోన్ ద్వారా మాట్లాడి తగిన విచారణ జరిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బి.జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీజీ కృష్ణాజీ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా సరఫరా అధికారి కేవీఎల్‌ఎస్ మూర్తి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా పశు సంవర్థక అధికారి ఎ.ఈశ్వర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి డా.ఎస్‌డీవీ రమణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఉరిటి సాయికుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

అర్జీలలో కొన్ని ఇలా ఉన్నాయి.

కుమారులు పోషించడం లేదు
నాకు, నా భార్యకు 70 సంవత్సరాలు పైబడ్డాయి. మా కుమారులు పోషించడం లేదు. మునిసిపాలిటీలోని కూరగాయల మార్కెట్‌లో కేటాయించిన షాపు నంబర్-17ను పెద్ద కుమారుడు రెడ్డి రఘునాథరావు, రెండవ కుమారుడు రెడ్డి మాధవరావులు ఆక్రమించి మాకు జీవనోపాధిలేకుండా చేశారు. వయోవృద్ధుల పరిరక్షణ చట్టం ప్రకారం తన కుమారులిద్దరిపై చర్యలు తీసుకొని, తన పేరున గల షాపు తనకు ఇప్పించి ఆదుకోవాలని పాలకొండ పట్టణంలోని మొగిలివీధికి చెందిన రెడ్డి గంగారావు అర్జీ అందజేశారు.

దూషిస్తున్నారు
సాలూరు పట్టణంలోని బంగారమ్మకాలనీలో ఇల్లు కొనుక్కుని గోడ కట్టిస్తుండగా పక్క ఇంటిలోగల ఎస్.కె.కృష్ణ కుమారులు శ్రీను, రోషన్ తనపై దౌర్జన్యానికి పాల్పడి, అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కుసాలూరుకు చెందిన రొంగలి ప్రమీల కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు వసూలు
సీతానగరం మండలం చెల్లంనాయుడువలస గ్రామానికి చెందిన కొట్టాన ఉమమహేశ్వరరావు తన మనుమడు నీలకంఠానికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1,50,000/- తీసుకుని మోసం చేశాడు. మోసగాడిపై చర్యలు తీసుకుని తన డబ్బులు తిరిగి ఇప్పించాలని పార్వతీపురం మండలం, డోకిశిల పంచాయతీ, తేలునాముడువలసకు చెందిన డి.సన్యాసి దొర అర్జీ అందజేశాడు.

బాలికా సంరక్షణ బాండు కావాలి
తనకు ఇద్దరు ఆడపిల్లలని, వారికి బాలికా సంరక్షణ పథకం బాండు మంజూరు చేయవలసిందిగా పార్వతీపురం మండలం పెద్ద బొండపల్లి గ్రామానికి చెందిన పి.సతీష్ దరఖాస్తు అందజేశాడు.

ఫిర్యాదులపై తక్షణమే చర్యలు
పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఎస్బీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొడ్డిదారిన బాల్య వివాహం..!

- ఫేక్‌స్టడీ సర్టిఫికెట్‌తో అధికారులకు బురిడీ
- విచారణలో నకిలీ సర్టిఫికెట్‌గా రూఢి
- స్వధార్ హోమ్‌కు బాలిక తరలింపు


బాల్య వివాహంపై విచారణ చేస్తున్న బాలల సంక్షేమ కమిటీ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నించే వారిపై, అందుకు సహకారించిన వారిపైన కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ఇంకా కొంతమందిలో మార్పు రావడం లేదు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అవగాహన కల్పిస్తున్నా పట్టించుకోకుండా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది బాల్య వివాహాలు చేయడానికి ఫేక్ సర్టిఫికెట్స్ సృష్టిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు అనేకం జరుగుతున్నప్పటికి కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి.

తాజాగా భోగాపురం మండలానికి చెందిన ఓ బాలికకు ఈనెల 24వ తేదీన వివాహం జరుగుతుందని బాలల సంరక్షణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో బాలల సంరక్షణ అధికారులు, చైల్డ్‌లైన్ సిబ్బంది, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు 24వ తేదీన గ్రామానికి చేరుకుని బాలికకు సంబంధించిన విద్యార్హత సర్టిఫికెట్స్ చూపించాలని అడగగా వారు ఓ ప్రైవేట్ పాఠశాల స్టడీ సర్టిఫికెట్ చూపించి వివాహం చేశారు. ఆ సర్టిఫికెట్‌పై అనుమానం రావడంతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్టడీ సర్టిఫికెట్‌పై విచారణ చేసి నివేదిక అందజేయాలని భోగాపురం మండల విద్యాశాఖాధికారి, ఎంపీడీఓను ఆదేశించారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఆ స్టడీ సర్టిఫికెట్ నకిలీదని నిర్ధారించారు. దీంతో ఆ బాలికను విజయనగరంలో ఉన్న స్వధార్ హోంలో బాలల సంక్షేమ కమిటీ, బాలల సంరక్షణ అధికారులు చేర్పించారు. అయితే ఫేక్ సర్టిఫికెట్ ఎవరిచ్చారనే దానిపై విచారణ జరుగుతోంది. భోగాపురం మండలానికి చెందిన ఓ టీడీపీ నేత బాల్య వివాహం చేయడంలో ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాల్య వివాహన్ని అడ్డుకోవడానికి వెళ్లిన అధికారులతో ఆ నేత వాగ్వాదానికి దిగినట్లు కూడా సమాచారం.

బాల్య వివాహాలు చేస్తే కేసు నమోదు

బాల్య వివాహాలు చేసేవారిపైనా, చేయడానికి సహకరించిన వారిపైన కేసులు నమోదు చేస్తాం. బాల్య వివాహాలు చేయడానికి దొంగ సర్టిఫికెట్స్ జారీ చేసే పాఠశాలలు, అధికారులపై కూడా కేసులు నమోదు చేస్తాం.

– కేసలి అప్పారావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్

మూడు బాల్య వివాహాల నిలిపివేత


బాల్య వివాహాలు నిలిపేసిన అనతరం గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో మార్చి, మే నెలల్లో జరగనున్న మూడు బాల్య వివాహలను నిలిపివేసినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయం మహిళా పోలీస్ పద్మ ఇచ్చిన సమాచారం మేరకు దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి బాల్య వివాహలు జరిపేందుకు సిద్ధమైన కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఉన్నత చదువులు చదివించాలని కోరుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించామన్నారు. వివాహనికి సిద్ధమైన యువకులు, వారి తల్లిదండ్రులకు కూడా మైనర్‌లతో వివాహం జరిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

అమృత్‌ను అభినందించిన డిప్యూటీ స్పీకర్


సూరు అమృత్‌ను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

చీపురుపల్లి: పట్టణానికి చెందిన దివ్యాంగ యువకుడు సూరు అమృత్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం చీపురుపల్లి వచ్చిన ఆయన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి కస్పావీధిలో గల సూరు అమృత్ నివాసానికి వెళ్లారు. అక్కడ అమృత్‌తో బాటు తల్లిదండ్రులను అభినందించారు. దివ్యాంగుడైన అమృత్ కష్టపడి చదువుకుని అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాడు. దీంతో ఆయన్ను అభినందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ అమృత్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే రెండు కాళ్లు పని చేయకపోయినప్పటికీ ఎంతో పట్టుదలతో చదువుకుని మంచి ఉద్యోగం సాధించాడని ప్రశంసించారు. అమృత్ ఎదుగుదలకు పూర్తి సహకారం అందించి వెన్నంటే ఉన్న తండ్రి ఎస్‌వీజీ, తల్లి దీపలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బెల్లాన వంశీకృష్ణ, మంగళగిరి శ్రీను, తాడేల ఉమ, కింతలి మధు తదితరులు పాల్గొన్నారు.

చిట్టి గురువులు, ఉపాధ్యాయులకు ప్రశంసలు

- జీపీఎం పాఠశాలను సందర్శించిన కలెక్టర్
- ట్యాబ్‌ల పనితీరు పరిశీలన, విద్యార్థులతో మాటామంతీ


విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: పట్టణ పరిధిలోని బీపీఎం (బొద్దు పైడం నాయుడు మెమోరియల్) కార్పొరేషన్ పాఠశాలను కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత పాఠశాల నుంచి చిట్టి గురువులు కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించి, ఇటీవల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో అద్భుత సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన 27 మంది విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కలెక్టర్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సఖి శిక్షణ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో చెబుతున్న అంశాలపై విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. ఇక్కడ అందించిన సూచనలను తప్పకుండా పాటించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రణాళిక ప్రకారం చదువు, ఆటలు కొనసాగించాలని హితవు పలికారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నవరత్నాలు పథకంలో భాగంగా విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. వాటి వినియోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో ఆమెతో పాటు అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ సుగుణాకర్ రావు, మున్సిపల్ పరిధిలోని సచివాలయాల ప్రతినిధి హరీష్, బీపీఎం పాఠశాల హెచ్‌ఎం విశాలాక్షి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల అరాచకం

- వేపాడ హైస్కూల్‌లో వీరంగం
- పోలీసులకు సమాచారం ఇచ్చిన హెచ్‌ఎం


ఆకతాయిలు పాడుచేసిన తరగతి గదులను పరిశీలిస్తున్న పోలీసులు, మహిళా పోలీసులు

వేపాడ: మండలకేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆరాచకాలు రోజురోజుకు పెరిగిపోవడంతో పాఠశాల హెచ్‌ఎం వల్లి ఉపాధ్యాయులు వల్లంపూడి పోలీసులకు సోమవారం సమాచారం అందజేశారు. పాఠశాలకు ప్రహరీ ఉన్నప్పటికీ ఆకతాయిలు చొరబడి తరగతిగదులు పాడుచేస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం పాఠశాలకు వచ్చి చూసేసరికి 9,10 తరగతుల గదుల తలుపులు పగులగొట్టి ఉన్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గదుల్లోకి వెళ్లి చూసేసరికి గదిలో కర్బూజా పండు ముక్కలు తిని టేబుల్స్‌పై రుద్దారు. మద్యం సీసాలు అక్కడే వదిలేశారు. మూత్రవిసర్జన చేయడంతో పాఠశాల తరగతి గదులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో పాఠశాల హెచ్‌ఎం మహిళాపోలీసులకు సమాచారం ఇచ్చి వల్లంపూడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, మహిళా పోలీసులు పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. గతంలో పలు పర్యాయాలు ఇలానే తరగతి గదులు పాడుచేస్తుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. కొంతకాలంగా ఏమీ జరగలేదని, మళ్లీ గత వారంలో ట్యాప్‌లన్నింటిని విరగ్గొట్టారని చెప్పారు. గ్రామ పెద్దలు, పోలీసులు సహకరించి పాఠశాలలో అభ్యంతరకరమైన పనులు జరగకుండా చూడాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ముగ్గురు ముద్దాయిలకు జైలు శిక్ష

గజపతినగరం: మండల కేంద్రంలోని కేతలా నగర్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో గత ఏడాది మేనెలలో చోరీ జరిగిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు జైలు శిక్ష విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు స్థానిక ఎస్సై గంగరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆరోజున నమోదు చేసిన చోరీ కేసులో విచారణ అనంతరం ముద్దాయిలు షేక్ ఆనంద్, కె.కిరణ్, ఎన్.సతీష్‌లకు ఏడాది పాటు కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున కోర్టు జరిమానా విధించినట్లు వివరించారు.

ఎన్‌సీసీ విద్యార్థినికి అభినందనలు


అభినందిస్తున్న ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ సీఎండీ అరవింద్

విజయనగరం అర్బన్: స్థానిక సీతం కళాశాల ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ బీటెక్ విద్యార్థిని అన్నా నేహా థామస్‌ను కళాశాలలో సోమవారం అభినందించి సత్కరించారు. ఎన్‌సీసీ ఢిల్లీ నుంచి కమాంటేషన్ కార్డ్‌ను ఆమె ఇటీవల సాధించింది. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ సీఎండీ అరవింద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో 2(ఏ) గర్ల్స్ బీఎన్, ఎన్‌సీసీ విజయనగరం కమాండింగ్ ఆఫీసర్ కల్నర్ ఏకేనౌతియాల్, ఏఓ మేజర్ శివాలి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామ్మూర్తి, కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వరన్యాయమందించాలి


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వరన్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె 24 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం వారితో మాట్లాడి, త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారులు వారి పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని, అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రానికి వచ్చి వ్యయప్రయాసలకు లోనుకావద్దన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు సీహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కానరాని స్వచ్ఛత..

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎండిపోయిన ఆకులు, వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులు నిత్యం సంచరిస్తున్నా పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. వివిధ పనుల మీద వచ్చే ప్రజలు ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో ముక్కున వేలేసుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


కార్యాలయ ప్రాంతంలో పేరుకుపోయిన ఆకులు

విద్యా రంగంలో
నూతన సంస్కరణలు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- సెంచూరియన్‌లో గజజ్యోతి వేడుకలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని సోమవారం సందర్శించిన ఆయన గజజ్యోతి పేరిట ఏర్పాటు చేసిన సాంకేతిక, సాంస్కృతిక వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో నూతన సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సెంచూరియన్ విశ్వ విద్యాలయం జిల్లాలో ఉండడం గర్వకారణమన్నారు. వర్సిటీ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు నాంది పలకడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ఇ-రిక్షా, వాటర్ మేనేజ్‌మెంట్, త్రీడీ టెక్నాలజీతో తయారు చేసిన నమూనాలు, ఆప్టికల్స్‌ను తిలకించి విద్యార్థులు, యాజమాన్యాలను అభినందించారు. అలాగే 95 ఏళ్ల వయసులో కూడా బోధిస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ శాంతమ్మను కలిసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు, వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, యాజమాన్య ప్రతినిధి రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

